# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 239
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
జూన్ 23, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## పత్రిక ఆగినా.. మిత్రుల కలయిక ఆగదు


8లో..

- మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్
- ఉదయం పూర్వపాత్రికేయ మిత్రమండలి తృతీయ సమావేశం

# జాడలేని వాన

- మొలకెత్తని విత్తనాలు
- బీళ్లువారుతున్న పొలాలు
- పలు జిల్లాల్లో ఇదే పరిస్థితి
- ఆగమవుతున్న అన్నదాతలు
- ఆరుతడి పంటలపై తీవ్ర ప్రభావం
- చినుకుకోసం రైతన్నల ఎదురు చూపులు

వివరాలు2లో..









ఈ సారి నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ముందుగానే ప్రవేశించాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ కూడా ప్రకటించింది. రోహిణీకార్తెకు ముందే తొలకరి పలుకరించింది. రెండు, మూడు వర్షాలు గట్టిగానే కురవడంతో రైతన్నల్లో ఆనందం వెల్లువిరిసింది. నైరుతి రుతుపవనాలు ఆశాజనకంగా ఉన్నాయన్న ఆశతో అన్నదాతలు సాగుకు సన్నద్ధమయ్యారు. దుక్కులు దున్ని ఆరుతడి పంటలైన పత్తి, మొక్కజొన్న విత్తనాలను నాటారు. పలు ప్రాంతాల్లో నార్లు కూడా పోశారు. గత పది హేను రోజులుగా వర్షపు జాడే కనిపించకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఎండ వేడిమికి నాటిన పత్తి, మొక్కజొన్న విత్తనాలు భూమిలోనే మాడిపోతున్నాయి. నార్లు పోసిన కర్షకుల పరిస్థితి దారుణంగా తయారైంది. అనేక గ్రామాల్లో స్ప్రింక్లర్లు, డ్రిప్, కాలువల ద్వారా నీటిని అందిచే ప్రయత్నం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో నారు ముదిరిపోవడంతో మరోమారు నారు వేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే ఒక్కో ఎకరానికి రూ.10వేలకు పైగానే ఖర్చు చేసినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతుల పరిస్థితి దయనీయంగా మారే అవకాశం ఉందంటూ కుమిలిపోతున్నారు.

- వరంగల్ వాయిస్, పరకాల





## ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

### లక్ష్మారెడ్డిపల్లిలో విషాదం

గణపురం మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఒద్దుల రాంరెడ్డి (46) తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్ కల్టివేటర్ తోలుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి తలకిందులుగా తిరగబడింది. దీంతో రాంరెడ్డి ట్రాక్టర్ లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య జ్యోతి, కూతురు అంజలి, కుమారుడు అక్షిత్ రెడ్డి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాంరెడ్డి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- వరంగల్ వాయిస్, గణపురం


8లో..

## నీరు కలుషితం కాకుండా చర్యలు

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- కేయూసీ, దేశాయిపేట ఫిల్టర్ బెడ్ లలో ఆకస్మిక తనిఖీ
- రీసైక్లింగ్ హబ్ పనితీరు పరిశీలన

# జాడ లేని వాన







- మొలకెత్తని విత్తనాలు
- బీళ్లువారుతున్న పొలాలు
- పలు జిల్లాల్లో ఇదే పరిస్థితి
- ఆగమవుతున్న అన్నదాతలు
- ఆరుతడి పంటలపై తీవ్ర ప్రభావం
- చినుకుకోసం రైతన్నల ఎదురు చూపులు

**వరంగల్ వాయిస్, పరకాల :** వానకాలం ఎంత త్వరగా విత్తనాలు నాటితే అంత మంచిదని.. చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాల బారినపడకుండా పంట చేతికి వస్తుందని రైతుల నమ్మకం! అయితే గతంలోకన్న భిన్నంగా మే నెల చివరిలోనే వర్షాలు పడడంతో రైతులు సంబురపడ్డారు. గత ఇరవై రోజులుగా అడపాదడపా నల్లటి మబ్బులు కనిపించడంతో దుక్కులు దున్ని సాగు ప్రారంభించారు. పలు ప్రాంతాల్లో పత్తి, మొక్కజొన్న విత్తనాలు నాటారు. ఇటు రోహిణి కార్తెలోనే కొందరు అన్నదాతలు వరి నార్లు పోశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో విత్తనాలు నాటిన రైతులు, ఇప్పటికే విత్తనాలు, దుక్కిదున్నినవి, కూలీల ఖర్చులు కలిపి దాదాపు ఎకరానికి సుమారు రూ.12వేల వరకు పెట్టుబడిగా పెట్టారు. ఇప్పుడు వరుణుడి జాడ కనిపించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

### రైతన్నల తండ్లాట..

పరకాల మండలంలో సుమారు 800 నుంచి 1100ఎకరాల్లో పత్తి సాగు చేస్తుండగా వరి దాదాపు పదివేల నుంచి 15 వేల ఎకరాల్లో పండిస్తున్నారు. మొక్కజొన్న 100 నుంచి 150 ఎకరాల్లో విత్తులు నాటారు. అదే విధంగా నడికుడ మండలంలో సుమారు 500 నుంచి 800 లఎకరాల విస్తీర్ణంలో రైతులు పత్తి సాగుచేస్తున్నారు. తొలకరి వానలు కురిసిన తర్వాత విత్తనాలు నాటారు. మొలకెత్తిన విత్తనాలను కాపాడుకునేందుకు రైతన్నలు పడరాని పాట్లు పడుతున్నారు. నీరు లేక భూములు బీటలు వారుతున్నాయి. నీళ్లు లేక మొలక భూమిలోనే ఎండిపోతుండగా కంటతడి పెడుతున్నారు. విత్తనాలు మొలకెత్తని ప్రాంతాల్లో మరోసారి నాటాల్సి వస్తుందని చెబుతున్నారు. బోర్లు, బావులు ఉన్న ప్రాంతాల్లో కొందరు స్ప్రింక్లర్లు, డ్రిప్, కాలువల ద్వారా విత్తనాలకు నీరు అందిస్తున్నప్పటికీ, ఆ సౌకర్యం లేని చోట వర్షం కోసం పడిగాపులు కాస్తున్నారు. దుక్కులు దున్ని పత్తి విత్తనాలు నాటి నెల రోజులు గడుస్తున్నా సరియైన వర్షం లేకపోవడంతో అన్నదాతల ఆశలు అడియాశలుగా మారాయి.

### ముఖం చాటేసిన వర్షాలు..

వరి నార్లు ఏపుగా పెరిగినప్పటికీ నాట్లేసేందుకు నీళ్లు లేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరకాల మండలం మలకపేట శివారులో బొజ్జం రాము అనే రైతు తన మూడెకరాల్లో నాటిన పత్తి పంటను కాపాడుకునేందుకు స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్నారు. వర్షాలు పడే వరకు పంటను బతికించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. స్ప్రింకర్లు లేని నిరుపేద రైతులు బకెట్లు, బిందెలతో మొలకలను నీరు అందిస్తున్నారు. అయితే వర్షాలు రాకపోవడంతో, వాటినికాపాడుకునేందుకు బకెట్లు, బిందెలతో నీరు అందిస్తున్నారు. ఈ వారంలోనైనా వర్షాలు పడకపోతే పెట్టుబడి కూడా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

### కౌలు రైతులు ఆగం..

రాష్ట్ర వ్యాప్తంగా వానకాలం సీజన్ ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు సరియైన వర్షం నమోదు కాలేదు. అయితే సొంత భూముల్లో విత్తనాలు వేసిన రైతుల పరిస్థితే వర్షాలు లేక దయనీయంగా ఉంటే ఇక కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని చెబుతున్నారు. అయితే కొందరు రైతులు ఇప్పటి వరకు ఇంకా సాగు మొదలు పెట్టనేలేదు. వానలు ఎప్పుడొస్తాయా.. అని ఎదురుచూస్తున్నారు. ఈ వరంలోనైనా వర్షాలు పడకపోతే కాలం ఒక నెల వెనక్కి పోయినట్లే అవుతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





# రంయ్యాల శ్రీధరాచార్యులకు సన్మానం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరం ఎల్ బీ నగర్ లోని మాసూమ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు శ్రీధరాచార్యులను తరాలపల్లి పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల, తరాలపల్లిలో 2004-05 విద్యా సంవత్సరాలనికి చెదిన పదో తరగతి విద్యార్థులు గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తమ ఉన్నత స్థాయికి కారకులైన గురువులను నుసన్మానించారు. వారు నేర్పిన క్రమ శిక్షణ, బోధనలు, జీవన విలువలు తమ ఉన్నతికి దోహదం చేశాయని కొనియాడారు. ఈ సందర్భములో తమకు చక్కని పాటాలు, పద్యాలతో తెలుగు బోధించిన శ్రీధరాచార్యులు పాడిన పాటలు, పద్యాలు గుర్తుకు తెచ్చుకున్నారు. వారు బోధించిన విలువలు ఎప్పటికి గుర్తుకు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా తమకు జ్ఞానం అందించిన గురువులు బాల్నె రామయ్య, శంకర్ రావు, పూర్ణయ్య, అంజిరెడ్డి, విజయలక్ష్మి, సుధాకర్, శ్రీనివాస్, రాజులను జ్ఞాపిక, షాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అభిలాష్, బండి రమేష్, సురేష్, సదానందం, రాజు, సతీష్ లను మనస్పూర్తిగా అభినందించారు. శ్రీధరాచార్యులు పాడిన స్నేహానికన్న మిన్న లోకాన లేదురా పాటకు మంత్ర ముగ్ధులై నాట్యం చేశారు. మరికొన్ని హుషారైన పాటలకు తమ గురువులతో నృత్యం చేసి కార్య క్రమాన్ని మరపు రాని జ్ఞాపకంగా మలచుకున్నారు.

# డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు

- హెల్మెట్ లేకుంటే వాహనాలు సీజ్
- ఎస్సై వెంకటేష్

**వరంగల్ వాయిస్, కన్నాయిగూడెం :** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కేంద్రంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ఎస్సై ఇ.వెంకటేష్ ఆద్వర్యంలో అభయమిత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు సహాయం చేయడంతోపాటు వారిలో భద్రత భావాన్ని పెంపొందించడానికి పోలీసులు రూపొందించిన ఒక కార్యక్రమమే అభయమిత్ర పోలీస్ అన్నారు. మాదక ద్రవ్య వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రభుత్వం, పోలీసులు కృత నిశ్చయంతో పనిచేస్తున్నారన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో విలువైన జీవితాన్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. అనారోగ్యంతోపాటు అనర్థాలు జరుగుతాయన్నారు. సామాజిక జీవితం, ఆర్థిక పరిస్థితులపై భారీ నష్టాలు జరిగే అవకాశం ఉందన్నారు. అలాగే వాహనలు నడుపుతూ హెల్మెట్ ధరించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహన తనిఖీల్లో భాగంగా నాలుగు ద్విచక్ర వాహనాలకు రూ. 2,400 జరిమానా విధించినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పలు గ్రామాల యువతీ, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.





# కోర్టు ఆదేశాలను అమలు చేయాలి

## సుప్రీం కోర్టు జోక్యం కోరిన తపాలా ఉద్యోగ సంఘం






**వరంగల్ వాయిస్, హుజురాబాద్:** న్యాయస్థానాలు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయకపోవడం అత్యంత శోచనీయమని తెలంగాణ రాష్ట్ర అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం (ఏఐపీఈయూ గ్రూప్ "సి") అధ్యక్ష, కార్యదర్శులు కామ్రేడ్ ఉకంటి మహేందర్, కామ్రేడ్ అద్దెట్ల శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు. తపాలా ఉద్యోగుల సంక్షేమం, చట్టబద్ధమైన హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న తమ సంఘానికి, ఎన్ఎఫ్‌పీఈకి వెంటనే గుర్తింపును పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా రైతులు చేపట్టిన ఆందోళనకు ఆర్థిక మద్దతు, సంఘీభావం ఇచ్చిందన్న కల్పిత, నిరాధార ఆరోపణలతో తపాలా శాఖ సీసీఎస్–ఆర్ఎస్ఏ–1993 రూల్స్ ప్రకారం ఎన్ఎఫ్‌పీఈ, దాని అనుబంధ సంఘం ఏఐపీఈయూ–గ్రూప్ "సి"కి పోస్టల్ డైరెక్టరేట్ 26-04-2023న గుర్తింపును ఉపసంహరించింది. దీనివల్ల తపాలా ఉద్యోగ సంఘానికి అధికారులతో ఉన్న సంప్రదింపుల హక్కులకు విఘాతం కలిగింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ ఉద్యోగ సంఘం దేశంలోని ప్రధాన హైకోర్టులలో రిట్ పిటిషన్లు దాఖలు చేయగా, రాంచీ–జార్ఖండ్ హైకోర్టు 12-04-2024న అభ్యంతరకరమైన డైరెక్టరేట్ ఆదేశాలపై స్టే ఆర్డర్ విధించి, తుది తీర్పు వెలువడే వరకు సంఘానికి అన్ని హక్కులను కొనసాగించాలని తీర్పు ఇచ్చింది. అయినా కోర్టు తీర్పును ఉద్దేశపూర్వకంగా అమలు చేయకపోవడం శోచనీయమని, సుప్రీంకోర్టు సైతం 24-09-2024న తుది తీర్పు వెలువడే వరకు హైకోర్టులు ఇచ్చిన స్టే ఆర్డర్లు కొనసాగించాలని, కేసును హైకోర్టుకు తిరిగి బదిలీ చేసే క్రమంలో ప్రకటించిందని నేతలు గుర్తు చేశారు. నిరాధార, కల్పిత ఆరోపణలు లేదా ఒక వ్యక్తి చేసిన తప్పుకు పూర్తి సభ్యులు ఆధారపడిన సంఘాన్ని ప్రమాదంలోకి నెట్టకూడదని, అందుకే తుది తీర్పు వరకు రాంచీ హైకోర్టు స్టే ఆర్డర్ కొనసాగించి అన్ని హక్కులు కల్పించి సభ్యత్వ రుసుము చెల్లించే సభ్యుల సంక్షేమం చూడాలని పేర్కొందని తెలిపారు. చివరికి 18-02-2025న రాంచీ హైకోర్టు తన తుది తీర్పును వెలువరిస్తూ, తపాలా ఉద్యోగ సంఘాలకు సంబంధించిన 5 సంవత్సరాలకు ఒకసారి ఇచ్చే గుర్తింపు 18-07-2024తో ముగిసిందని, 18-07-2025 వరకు అన్ని సంఘాలకు ఒక సంవత్సరం గుర్తింపు గడువు పొడిగించినందున ఎన్ఎఫ్‌పీఈ, దాని అనుబంధ సంఘం ఏఐపీఈయూ గ్రూప్ "సి" సంఘాలకు సభ్యత్వ ధ్రువీకరణ ప్రక్రియ ముగిసేంతవరకు అన్ని గుర్తింపు సంఘాల మాదిరిగానే మునుపటి అన్ని హక్కులు మూడు నెలల గడువులోగా కల్పించాలని తీర్పునిచ్చిందని వివరించారు.

### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వినతి..

మూడు నెలలు దాటినా ఉద్దేశపూర్వకంగా ఈ ప్రభుత్వం తపాలా శాఖకు ఉద్యోగ సంఘానికి గుర్తింపును పునరుద్ధరణ చేస్తూ సంఘ్గాగత హక్కులు కల్పించాలనే ఆదేశాలు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గౌరవనీయులు జస్టిస్ బి.ఆర్. గవాయికి తమ హక్కుల కోసం, సంక్షేమం కోసం సంఘంలో కొనసాగుతున్న 65% సభ్యులు ఆధారపడిన మెజారిటీ సంఘానికి అన్ని హక్కులు కల్పించేలా తక్షణమే జోక్యం చేసుకొని సంఘానికి గుర్తింపు పునరుద్ధరణ చేసేలా ప్రభుత్వానికి, పోస్టల్ డైరెక్టరేట్‌కి ఆదేశాలు జారీ చేయాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల గ్రూప్ "సి" కేంద్ర సంఘం కార్యదర్శి కామ్రేడ్ నరేష్ గుప్తా వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. వెంటనే రాజ్యాంగానికి లోబడి న్యాయస్థానాలు జారీ చేసిన ఆదేశాలను అమలు చేయాలని, ఉద్యోగ సంఘానికి గుర్తింపును పునరుద్ధరణ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఏఐపీఈయూ గ్రూప్ "సి" అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్ యు. మహేందర్, కామ్రేడ్ ఎ. శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

## నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులు ఆపదలో ఉన్న పేదలకు ఎంతగానో లబ్ధి చేకూరుస్తాయని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలు, రెండు పట్టణాలకు చెందిన మొత్తం 198 మంది లబ్ధిదారులకు రూ.75,67,000/- (డెబ్బై ఐదు లక్షల అరవై ఏడు వేల రూపాయలు) విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.హుజూరాబాద్ మండలం–31, హుజూరాబాద్ పట్టణం–18, జమ్మికుంట మండలం–22, జమ్మికుంట పట్టణం–13, వీణవంక–39, ఇల్లందకుంట–21, కమలాపూర్–54 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించడం జరిగింది.

# రేపు డీసీసీ బ్యాంక్ మహా జనసభ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహా జన సభ 24 మంగళ వారం ఉదయము 11:00 గంటలకు నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం మూడవ అంతస్తులో గల ఆడిటోరియంలో డీసీసీబీ అధ్యక్షుడు మార్నేని రవీందర్ రావు అధ్యక్షతన నిర్వహించబడుతుందని సోమవారం వరంగల్ జిల్లా డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్ తెలిపారు. ఈ సందర్భంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణాల పంపిణీ, వ్యవసాయ రుణాలు, విద్య రుణాలు, వసూళ్లు వివిధ రకాల పథకాలపై చర్చిస్తామన్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో పాటు సహకార సంఘాల చైర్మన్లు, వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమలతో పాటు వివిధ శాఖల జిల్లాల అధికారులు తప్పకుండా పాల్గొనాలని సీఈఓ కోరారు.

# వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఈ–నామ్ పద్ధతి రద్దు చేయాలి



## ● జేడీఎంకు రైతు సంఘాల నాయకుల వినతి

**వరంగల్ వాయిస్, ఎనుమాముల:** వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో అమలవుతున్న ఈ–నామ్ (e-NAM) పద్ధతిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, రైతు సంఘాల నాయకులు మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (జేడీఎం) శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ–నామ్ విధానం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు యార్డులో గత కొంతకాలంగా అమలవుతున్న ఈ పద్ధతిలో ఒకసారి బిడ్డింగ్ అయిన తర్వాత వ్యాపారులు సరుకులను కొనుగోలు చేయకపోతే రైతులకు మళ్లీ బిడ్డింగ్ చేసే అవకాశం ఉండటం లేదని తెలిపారు. దీనివల్ల రైతులు మరుసటి రోజు వరకు అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, ఇది వారికి ఆర్థిక నష్టాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. కొందరు రైతులు అనుకున్నంత ధర రాకపోవడంతో చేసేదేమీ లేక తక్కువ ధరకే అమ్ముకొని వెళ్లిపోతున్నారని, ఈ విధానం వ్యాపార వర్గాలకు అనుకూలంగా ఉందని వారు ఆరోపించారు. తమ ఉత్పత్తులకు ఎంత ధర పలికిందనేది వ్యాపారులు చెప్పేంత వరకు రైతులకు తెలియడం లేదని కూడా వారు గుర్తించారు. రైతు ఉత్పత్తులను వ్యాపారులు కొనుగోలు చేయకుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలి, మార్కెట్‌లో రెండోసారి బిడ్డింగ్ ఏర్పాటు చేయాలి, లేదా, ఈ–నామ్ పద్ధతిని రద్దు చేసి పాత పద్ధతినే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జేడీఎంను కలిసిన వారిలో తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు సోమిడి శ్రీనివాస్, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, అఖిల భారత కిసాన్ సంఘటన్ (ఏఐకేఎస్) సుధ మల్ల భాస్కర్, అఖిల భారత కిసాన్ సంయుక్త సభ జిల్లా కన్వీనర్ వల్లందాస్ కుమార్ ఉన్నారు.

# ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తాం

## కార్పొరేటర్ గుండేటి నరేందర్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్ సోమవారం ఇందిరమ్మ ఇల్లు పునాదికి ముగ్గుపోసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్ మాట్లాడుతూ 20వ డివిజన్ లో ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్ కాపీ వచ్చిన వారు ఖాళీ స్థలం ఉంటే నన్ను సంప్రదించాలని కోరారు. నేడు ఇందిరమ్మ ఇల్లుకి శంకుస్థాపన చేసుకున్న వారిలో గడ్డం సరోజన, బేతి సుజాత, కుమ్మరి కుంట్ల వేణు, కిన్నెర మణెమ్మ,బి శ్రీదేవి ఉన్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ వార్డు ఇంచార్జి సందీప్, గోరంటల రాజు, పెండ్యాల కొమరయ్య, సింగారం చిరంజీవి, పెండ్యాల స్వరాజ్, కూరాకుల శేఖర్, శివ, తోట బాలరాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇల్లు గురించి మిమ్మల్ని ఎవరైనా డబ్బులు అడిగినచో ఈ నెంబర్ కు (98480 72577) ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రేవంత్ సర్కార్ కృషి

## ● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, గణపురం :** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి రేవంత్ సర్కార్ కట్టుబడి ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో, పదవ తరగతిలో ర్యాంకులు సాధించిన 8 హైస్కూళ్లకు చెందిన 16 మంది విద్యార్థులకు ఆయన ప్రతిభా పురస్కారాలను అందజేశారు. జిల్లా పెన్షనర్స్ కట్కూరి అశ్విని జ్ఞాపకార్థం ఆమె తల్లిదండ్రులు రాధిక, శ్రీనివాస్, తాత పుప్పాల రామారావు ఈ అవార్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్ఆర్ మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులందరూ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వసతులతో పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. పదవ తరగతిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆయన అభినందించారు. మండలంలోని హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.10 కోట్లు మంజూరు చేశానని, పాఠశాలల అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయడానికి తాను సుముఖంగా ఉన్నానని ఎమ్మెల్యే సత్యనారాయణ రావు తెలిపారు. అయితే హెచ్ఎంలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి జిల్లా పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు రాజమౌళి అధ్యక్షత వహించగా, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కిష్టయ్య, రాజేందర్, కాంగ్రెస్ నాయకులు డి. శంకర్, శివ శంకర్, దేవేందర్ పాల్గొన్నారు.

# ఎడ్ల దొంగ అరెస్ట్

**వరంగల్ వాయిస్, శాయంపేట :** గోవిందాపూరం గ్రామానికి చెందిన మాందాటి కుమారస్వామికి చెందిన రూ. 1,10,000 విలువైన రెండు ఎడ్లను జూన్ 19న తెల్లవారుజామున దొంగలించిన కేసులో, దొంగను పోలీసులు పట్టుకున్నారు. కుమారస్వామి ఫిర్యాదు మేరకు జూన్ 21న కేసు నమోదైంది. ఎడ్లను దొంగలించిన వ్యక్తి కోగిల రాజు (పెద్దకోడేపాక వాసి)గా గుర్తించి, శాయంపేట సీఐ రంజిత్ రావు సోమవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దొంగను త్వరితగతిన పట్టుకున్న కానిస్టేబుళ్లు సతీష్, ఖలీద్‌లను సీఐ రంజిత్ రావు రివార్డు ప్రకటించి అభినందించారు. దొంగలించబడిన ఎడ్లను ప్రాణాలతో తిరిగి దొరకబట్టినందుకు ఫిర్యాది కుమారస్వామితో పాటు గోవిందాపూరం రైతులు పోలీసులపై హర్షం వ్యక్తం చేశారు.

# టీడబ్ల్యూజేఎఫ్ బచ్చన్నపేట మండల అడ్‌హక్ కమిటీ ఎన్నిక

## అధ్యక్షుడిగా జంగిలి సాయిబాబా ఏకగ్రీవం



**వరంగల్ వాయిస్, బచ్చన్నపేట :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) బచ్చన్నపేట మండల అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడిగా జంగిలి సాయిబాబా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం బచ్చన్నపేట మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వల్లాల జగన్, జిల్లా అధ్యక్షులు నీల నరేష్ బాబు, జిల్లా కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వల్లాల జగన్ మాట్లాడుతూ, పాత్రికేయుల సమస్యలపై నిరంతరం పోరాడే సంఘం టీడబ్ల్యూజేఎఫ్ అని అన్నారు. అదేవిధంగా నీల నరేష్ బాబు మాట్లాడుతూ, జర్నలిస్టులు అందరూ ఐక్యంగా ఉండాలని, సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ అడ్‌హక్ కమిటీలో ఇతర సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** రైతును రాజును చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేసి, ఇప్పటివరకు 1 కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రివర్గ సభ్యులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఎకరానికి రూ.10 వేలు ఇవ్వగా, ఇప్పుడు తమ ప్రభుత్వం ఎకరానికి రూ.12 వేల చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించిందని రాజిరెడ్డి గుర్తు చేశారు. ఈ నెల 16న రైతు భరోసా నిధుల విడుదల ప్రారంభించామని, రేపటితో 100 శాతం వ్యవసాయ భూములకు భరోసా నిధుల విడుదల పూర్తవుతుందని ఆయన వెల్లడించారు.

# శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలో బీజేపీ ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక, ఆర్థిక జాతీయవాదాన్ని పునాదిగా, సనాతన ధర్మ రక్షణను ధ్యేయంగా చేసుకొని భారతీయ జనసంఘ్‌ను స్థాపించిన మార్గదర్శి శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. "ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిశాన్ నహీ చలేగా" (ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానమంత్రులు, రెండు జెండాలు ఉండకూడదు) అనే నినాదంతో దేశ ఐక్యత కోసం తన ప్రాణాలను అర్పించిన ధైర్యశాలి ఆయన అని గుర్తుచేశారు. వారి ఆలోచనలు, స్ఫూర్తి నేటి యువతరానికి ఎంతో ఆదర్శనీయమైనవని, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని దేశ ఐక్యత కోసం యువత పనిచేయాలని పిలుపునిచ్చారు.

# అన్ని కులాల అభ్యున్నతే నా ధ్యేయం

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వారి అభ్యున్నతి, అభివృద్ధి కోసమే నిత్యం పాటుపడతానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ అలంకరణ జంక్షన్ వద్ద రూ.705.84 లక్షల సీఎంఏ నిధులతో నిర్మించనున్న ఉమ్మడి జిల్లా మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి, ఈరోజు ఇంతటి మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని పేర్కొన్నారు. సకాలంలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తామని తెలిపారు. రాజకీయంగా, వ్యక్తిగతంగా తనకున్న మిత్రులలో అధికులు మున్నూరుకాపు వారేనని, తన అభ్యున్నతి ఆలోచనల్లో చాలా వరకు భాగస్వాములు అవుతున్నారని ఎమ్మెల్యే నాయిని ఈ సందర్భంగా తెలిపారు. రానున్న రోజుల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, మంత్రుల సమిష్టి కృషితో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

### ఇందిరమ్మ ఇల్లు పేదల ఆత్మగౌరవ ప్రతీక..

వాస్తవమైన సంక్షేమ పాలనను చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల గృహ కలలను నిజం చేస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం 59వ డివిజన్ రాయపురలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు అనేది ఒక్క నివాసం కాదని అది ఓ కుటుంబానికి గౌరవం, భద్రత, గుర్తింపు అని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా ఆత్మగౌరవానికి బలమైన పునాది వేస్తున్నమన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం ఒక్కటే ప్రతి అర్హత గల కుటుంబానికి స్వగృహం అందించాలి. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇళ్లను 3.5 సంవత్సరాల్లో నిర్మించేందుకు మేం కట్టుబడి ఉన్నమని మొదటి దశలో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభమవుతోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, డివిజన్ ఇంచార్జి కేతిడి దీపక్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రవి కిరణ్, నాయకులు తేళ్ల సుగుణ కిషోర్, మదర్, దొంగరి శ్రీనివాస్, నబీన్, అమిత్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో బలిదాన్ దివస్



**వరంగల్ వాయిస్, పరకాల :** బీజేపీ పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో మాజీ కేంద్రమంత్రి, జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ ను ఘనంగా నిర్వహించారు. పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన పట్టణ కార్యాలయంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడుతూ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆలోచనలు, స్ఫూర్తి నేటి యువతరానికి ఎంతో ఆదర్శనీయమని అన్నారు. ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని దేశ ఐక్యత కోసం యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖర్జీ త్యాగాలను తాము మరువమని, వారి ఆశయాలను కొనసాగించడమే వారికిచ్చే నిజమైన నివాళి అని సంతోష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పరకాల పట్టణంలోని ప్రతి బూత్‌లో బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో మొక్కలు నాటి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ ఆర్పీ జయంతి లాల్, మాజీ పరకాల మున్సిపల్ చైర్మన్ మార్త రాజభద్రయ్య, మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి, పట్టణ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి తిరుపతి, పట్టణ ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, నాయకులు మారేడుగొండ భాస్కరాచారి, కుక్కల విజయ్ కుమార్, వెనిశెట్టి శారద, దంచనాదుల కిరణ్ కుమార్, కానుగుల గోపీనాథ్, కుంట మల్ల గణేష్, దాసరి వెంకటేశ్వర్లు, ముత్యాల దేవేందర్, మేకల ప్రవీణ్, తడక విక్రం, వనం రాజేందర్ పాల్గొన్నారు.

# యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఒలంపిక్ రన్



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సోమవారం జిల్లా యువజన, క్రీడల శాఖ అధ్వర్యంలో ఒలంపిక్ డే–2025 సందర్భంగా ఉదయం 7.00 గం.లకు నెహ్రూ పార్క్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఒలంపిక్ రన్ కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకట్ రెడ్డితో పాటు జిల్లా వ్యవసాయ అధికారి, రామారావు నాయక్ , సర్కిల్ ఇన్స్ పెక్టర్ దామోదర్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. అంతేగాక ఈ కార్యక్రమంలో పాల్గొని యువతకు స్ఫూర్తినిచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ...యువత ప్రతి ఒక్కరు విద్యతో పాటు వారికి ఇష్టమైన క్రీడలలో సాధన చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన క్రీడల శాఖ, పోలీసు శాఖ, మున్సిపల్ శాఖ, సిబ్బంది, జనగామ జిల్లా క్రీడా అసోసియేషన్ సభ్యులు జి.మనోజ్ కుమార్, కే. హనుమంతరావు, గోర్ సింగ్, రవి, అబ్బాస్, రంజిత్, సురేష్ , రాజు, గుణ వర్ధన్ , యువత, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి శ్రీ సాయిచంద్ర ఫౌండేషన్ చైర్మన్ ఇరుగు సిద్దులు, బి.వెంకటేశ్వర్లు టీ షర్ట్స్ అందించి, పాల్గొన్నవారికి పండ్లు పంపిణీ చేశారు.

# నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా కేంద్రంలోని నారాయణ విద్యాసంస్థలు ప్రభుత్వ అనుమతులను తుంగలో తొక్కి, జీవో నంబర్లు 1, 10, 92, 42 లను ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా ఫీజులు పెంచాయని, పెంచిన ఫీజులను నోటీసు బోర్డులో పెట్టకుండా, నిబంధనలు పాటించకుండా నడుస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆరోపించింది. ఈ వ్యవహారంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు హనుమకొండ జాయింట్ కలెక్టర్ ఏ. వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత్ గౌడ్, భాష బోయిన సంతోష్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ప్రభుత్వ జీవోలను ఉల్లంఘిస్తున్నాయని, విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలను ఆసరాగా చేసుకుని ఈ విద్యా సంవత్సరంలో 10 నుంచి 20 శాతం ఫీజులు పెంచాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ఫీజులను నోటీసు బోర్డులో పెట్టకుండా, విశాలమైన తరగతి గదులు లేకుండా, కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా జీవో నంబర్లు 1, 10, 92, 42 లను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. దీంతో పాటు పాఠశాలలో షూ, టై, బెల్టు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతూ "మూడు పువ్వుల ఆరు కాయలుగా" వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ అంశాలపై తగిన న్యాయ విచారణ జరిపి కార్పొరేట్ నారాయణ విద్యాసంస్థలను తక్షణమే మూసివేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, జక్కుల భాను ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శులు బొజ్జు జ్యోతి, కసరబోయిన రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 9 సార్వత్రిక సమ్మెకు సీఐటీయూ నోటీస్

## ● జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జూలై 9న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీసును సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కు అందజేశారు. సహాయ కార్యదర్శి పుల్లా అశోక్, సీఐటీయూ నాయకులు జే. శ్వేత, లీల, వి. రమాదేవి, పి. పద్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని జూలై 9న సార్వత్రిక సమ్మెను జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్నామని కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలోని కార్మిక వర్గం జూలై 9న సమ్మెలో పాల్గొంటుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో షాపింగ్ మాల్స్, హోటల్స్, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో కనీస వేతనాలు అమలు కావడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించడం లేదని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు పరచడం లేదని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. జిల్లా లేబర్ అధికారులు కనీస వేతనాలను అమలు చేయించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు అమలయ్యే విధంగా చూడాలని వారు కలెక్టర్‌ను కోరారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్యకు కూడా జూలై 9 సార్వత్రిక సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసులు సీఐటీయూ నాయకులు అందజేశారు. ఆశాలకు కనీస వేతనం రూ.26 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, జాబ్ చార్ట్‌లో లేని పనులను ఆశలతో చేయించరాదని జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు.

# కొత్త కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** తమ డివిజన్‌లో కొత్తగా వెలుస్తున్న కాలనీలకు మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి తాను శాయశక్తులా కృషి చేస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఉర్సు ఉప్పర్ల రోనికుంట మంకీ ఫుడ్ కోర్టు సమీపంలో కొత్తగా నిర్మించుకున్న గృహాలకు స్థానికులు ఎన్‌ఎస్‌ఎన్ కాలనీగా నామకరణం చేయగా, ఆ నామకరణ బోర్డును కార్పొరేటర్ మరుపల్ల రవి ఆవిష్కరించారు. కొత్తగా ఇల్లు కట్టుకున్న వారు తమ ఇంటి పన్ను, చెత్త పన్నులను సకాలంలో చెల్లించినట్లయితే డివిజన్ అభివృద్ధికి అధికారులు నిధులు ఎక్కువగా మంజూరు చేస్తారని ఆయన తెలిపారు. త్వరలోనే కాలనీలోకి మిషన్ భగీరథ నీళ్లు రావడానికి కొత్త పైప్‌లైన్ వేయడానికి అధికారుల దృష్టికి తీసుకువెళ్లానని, కొద్ది రోజుల్లోనే అది కార్యరూపం దాలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాగపురి రవిచంద్ర, బానోత్ మోహన్, పోగాకు రవి, గడ్డం యుగంధర్, వాసం రమేష్, నాగపూరి నగేష్, నాగపూరి కుమారస్వామి పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాడి కౌశిక్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరుతూ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్ మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గొర్రె కిరణ్, హసన్‌పర్తి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బిగుళ్ల సురేష్ మాట్లాడుతూ, కౌశిక్ రెడ్డిని "రాజకీయ బ్రోకర్" అని ఆరోపించారు. కేసీఆర్ సభ కోసం క్వారీ యజమానిని బ్లాక్‌మెయిల్ చేసి రూ. 50 లక్షలు ఇవ్వకపోతే చంపుతానని బెదిరించి, యజమాని కేసు పెట్టడంతో దుబాయ్ పారిపోతుండగా ఎయిర్‌పోర్టులో పట్టుబడి అరెస్ట్ అయింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు రూ.20 లక్షలు తీసుకొని మర్రిపల్లిగూడెంలో ఊరును డెవలప్ చేస్తానని క్వారీ యజమాని దగ్గర డబ్బులు తీసుకొని బ్లాక్‌మెయిల్ చేసి వాడుకుంది కౌశిక్ రెడ్డి కాదా అని ఆరోపించారు. "బిడ్డా ఖబర్దార్! ఇంకొక్కసారి ఎమ్మెల్యే నాగరాజుపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నువ్వు ఎక్కడ కనబడ్డా చెప్పుతో కొట్టే రోజులు వస్తాయని" వారు తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, ఎర్రగట్టుగుట్ట దేవస్థానం చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, మాజీ యూత్ మండల అధ్యక్షులు సౌరం చరణ్ తేజ, పెద్దమ్మ రామ్ నర్సింలు, బోయిని శశికాంత్, శీలం వంశీ, మల్లారెడ్డిపల్లి మాజీ ఉపసర్పంచ్ భగత్, జన్ను ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** బీజేపీ ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ ను ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం బీజేపీ మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక, ఆర్థిక జాతీయవాదాన్ని పునాదిగా, సనాతన ధర్మ రక్షణను ధ్యేయంగా చేసుకొని భారతీయ జనసంఘ్‌ను స్థాపించిన మార్గదర్శి శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. "ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిశాన్ నహీ చలేగా" (ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానమంత్రులు, రెండు జెండాలు ఉండకూడదు) అనే నినాదంతో దేశ ఐక్యత కోసం తన ప్రాణాలను అర్పించిన ధైర్యశాలి ఆయన అని గుర్తుచేశారు. జీవితాంతం హైందవ సాంస్కృతిక వికాసం కోసమే కృషి చేసిన నిత్య చైతన్యశీలి అని అన్నారు. స్వతంత్ర భారతదేశ తొలి పరిశ్రమల మంత్రిగా, జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను వ్యతిరేకిస్తూ పోరాటం చేసిన ముఖర్జీ, 1953లో అనుమానాస్పద పరిస్థితుల్లో జైలులో ప్రాణాలు కోల్పోయారని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అనంతరం భారత ప్రధాని నరేంద్ర మోదీ 11 సంవత్సరాల వికసిత్ భారత్ అమృతకాలంలో భాగంగా "అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమంలో ఒక మొక్కను నాటారు. అదేవిధంగా ప్రతి బూత్ పరిధిలో 11 మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు గట్టు వేణు గౌడ్, మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం, మండల ప్రధాన కార్యదర్శులు బయ్య పైడి ఆచార్య, రవ్వ శివప్రసాద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు వేములపల్లి శ్రీలత, సీనియర్ నాయకులు బొల్లెపల్లి రాజు, మండల ఉపాధ్యక్షులు పిసాల సాంబయ్య, బూత్ అధ్యక్షులు పోగుల యాదగిరి, పిట్టల స్వామి, బూర దశరథం, తొట మల్లేశం, టెంకురాల రామారావు, కక్కెర్ల సాంబయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత మత్తుకు బానిస కాకూడదు

## హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** యువత మత్తుకు బానిస కాకూడదని హనుమకొండ ఇన్ స్పెక్టర్ మచ్చ శివకుమార్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం భాగంగా సోమవారం కుమార్ పల్లి గవర్నమెంట్ మర్కాజి హై స్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకం వలన వాటిల్లే దుష్ ప్రభావాలు పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ శివ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై తద్వారా నేరాలకు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలు నష్టాలు విద్యార్థులకు తెలిసి ఉండాలని పేర్కొన్నారు. గంజాయి ఎవరైనా అమ్ముతున్నా, తాగుతున్నా తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 కి తెలపాలని వీటి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు చదువులో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని హనుమకొండ ఇన్ స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పరశురాములు, ఉమెన్ ఏ ఎస్సై లక్ష్మి, సిబ్బంది, స్కూల్ ప్రిన్సిపాల్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే సాధికారత సాధ్యం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** విద్య ద్వారా వచ్చిన విజ్ఞానం తో వ్యక్తి, సమాజం అభివృద్ధి సాధించవచ్చునని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నాగవాణి తెలిపారు. స్థానిక పీఎంశ్రీ జడ్పీ స్కూల్లో జరిగిన సెమినార్ లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికలు పిన్న వయస్సులోనే పెళ్లి చేసుకోవద్దని దాని వల్ల ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్తును కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ గడ్డం ఉమ బాలికా రక్షణ కోసం వచ్చిన పోక్సో చట్టం గురించి వివరించారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు మాదక ద్రవ్యాల వినియోగం వాటి ప్రమాదం గురించి వివరించారు. సీడబ్ల్యూసీ జిల్లా సభ్యులు డేవిడ్,ప్రధానోపాధ్యాయులు నరసింహా రావు సందేశమిచ్చారు. టీచర్లు కలపాల అనిత, రవికుమార్ లు మొక్కలు నాటించగా అనంతరం మాదక ద్రవ్యాల వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అప్పి రెడ్డి, శంకర్, రాం నాయక్, బిచ్చా, శ్రీనివాస్, సమిత, దమయంతి, శేషు కుమారి, వసంత రాణి, శ్రీలక్ష్మి, వెంకటేశ్వర్లు, సాహెబ్ అలీ, శంకరయ్య, సీతా రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** విద్యార్థులు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నర్సింగరావు అన్నారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని నేర్పుల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, కందిబండ మండల ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన హెల్త్ క్యాంపులో ఆయన ఈ సూచన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నర్సింగరావు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా రోగాల బారిన పడకుండా ఉండవచ్చని ఆయన తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జ్వరం, దగ్గు, పడిశం వంటి లక్షణాలు ఉన్నప్పుడు పాఠశాలకు రాకూడదని విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పీడీఎంఓ కందకట్ల సంపత్, హెల్త్ సూపర్వైజర్లు అనిల్ కుమార్, రాజ్యలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, జూన్ 23, 2025

# కానిస్టేబుల్‌ను అభినందించిన సీపీ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైమ్,** : వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న సాయిరాంను పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు. గత వారం క్లాపిల్లా వారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన అతిపెద్ద పరుగు పోటీలో సాయిరాం పాల్గొని సిల్వర్ మెడల్‌ను సాధించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, భవిష్యత్తులో సాయిరాం మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించే పోలీస్ క్రీడాకారులకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేష్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ స్పర్జన్ రాజ్ హాజరయ్యారు.

# మంత్రాల నెపంతో వృద్ధ దంపతులపై దాడి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి** : మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు బాల్య వెంకటయ్య, అతని భార్య లచ్చమ్మలపై దాడి జరిగింది. తమ తల్లిదండ్రులు మూడు సంవత్సరాలుగా మంత్రాలు చేస్తున్నారని ఆరోపిస్తూ ఎల్లమ్మ, ఆమె కుమారుడు రాజు, కూతురు జ్యోతి కలిసి దాడి చేశారని బాధితుల కుమారుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా తమపై అక్రమ కేసులు పెట్టించారని, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, గ్రామంలో పరువు తీసే విధంగా తిరుగుతున్నారని, దొంగ సాక్ష్యాలతో కేసులు పెట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని బాధితుల కుమారుడు ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రిపై లేనిపోని అబాండాలు వేస్తూ, మంత్రాల నెపంతో కక్షపూరితంగా ఇంటిపై దాడి చేయడానికి ప్రయత్నించారని, ఇంట్లో ఉన్న తనను బయటికి రమ్మని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేశారని బాధితుల కుమారుడు మీడియా ముందు వాపోయాడు.

# బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ నిధులు విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ** : జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదువుతున్న నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మూడు సంవత్సరాల పెండింగ్ నిధులు తక్షణమే విడుదల చేసి వారిని ఆదుకోవాలని స్వేరోస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం స్వేరోస్ నాయకులు ఒంటేరు చక్రి, శనిగరపు రాజేంద్రప్రసాద్, మారేపల్లి మనోజ్, ఎల్తూరి సాయికుమార్ లు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు విడుదల కాకపోవడంతో పాఠశాల యాజమాన్యాలు చేతులెత్తేశాయని తెలిపారు. దీంతో విద్యార్థులందరూ ఎక్కడ చదువుకోవాలో తెలియక సతమతమవుతున్నారని, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికత కలిగిన విద్యార్థులు కేవలం సీటు కోసం వలస వెళ్లే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. కాబట్టి, విద్యార్థుల స్థానికత ఆధారంగా స్థానిక ప్రైవేట్ విద్యా సంస్థల్లోనే స్థానికంగా ఉన్న పిల్లలకు సీట్లు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గత పెండింగ్ నిధులతో పాటు ఈ సంవత్సరం కూడా బెస్ట్ అవైలబుల్ స్కీంను కొనసాగిస్తూ పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ఆదుకోవాలని, ఈ విషయాన్ని కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ మంత్రికి తెలియజేయాలని స్వేరోస్ నాయకులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు.

# తై బజార్ వేలంలో అవకతవకలు

◆ వక్ఫ్ బోర్డు ఉద్యోగిగా.. టెండరర్ గా ఒకే వ్యక్తి

◆ అక్రమంగా జీతం వసూలుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి** : అన్నారం షరీఫ్ గ్రామ పంచాయతీలో తై బజార్ వేలంలో అవకతవకలు జరిగాయని, అలాగే వక్ఫ్ బోర్డు ఉద్యోగి అక్రమంగా జీతం వసూలు చేస్తున్నాడని ఆరోపిస్తూ పఠాన్ సద్దాం ఖాన్ అనే యువకుడు వరంగల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తన ఫిర్యాదులో సద్దాం ఖాన్ పేర్కొన్న వివరాల ప్రకారం, తై బజార్ టెండరర్ తన టెండర్‌ను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు చేయలేదు. అయినప్పటికీ, టెండర్ నియమాలు, నిబంధనలను ఉల్లంఘిస్తూ, ప్రత్యేక అధికారి పాక శ్రీనివాసులు, కార్యదర్శి మోహిన్లు టెండరర్‌కు సహకరిస్తున్నారని, టికెట్ విక్రయాలు అధిక ధరలకు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించాడు. అధికారులు టెండరర్ నుంచి లంచాలు తీసుకున్నారని కూడా సద్దాం ఖాన్ ఆరోపించాడు. చర్య తీసుకోవాల్సిన అధికారులు టెండరర్‌తో కలిసి పనిచేయడం వల్ల, వారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆయన వాపోయాడు. ఈ విషయంపై జిల్లా స్థాయి అధికారులతో దర్యాప్తుకు ఆదేశించాలని, అధికారి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి గ్రామ పంచాయతీ డిపాజిట్, ఖర్చులపై విచారణ నిర్వహించాలని పఠాన్ సద్దాం ఖాన్ జిల్లా కలెక్టర్‌ను అభ్యర్థించాడు.

● వక్ఫ్ బోర్డు ఉద్యోగిపై పలు ఆరోపణలు..

వక్ఫ్ బోర్డు ఉద్యోగి బాషు మియా తన విధులను నిర్వర్తించకుండా కేవలం హాజరు వేసుకొని జీతం వసూలు చేస్తున్నాడని సద్దాం ఖాన్ మరో ఫిర్యాదులో పేర్కొన్నాడు. అన్నారం షరీఫ్ దర్గాలో భద్రతా ఉద్యోగి అయిన బాషు మియా తన బాధ్యతలను నిర్వర్తించడం లేదని, విధులను నిర్వర్తించడానికి బదులుగా అన్నారం షరీఫ్ గ్రామ పంచాయతీకి సంబంధించిన తై బజార్ టెండర్ టిక్కెట్లను అమ్ముతున్నాడని ఫిర్యాదులో ఆరోపించబడింది. దీనికి సాక్ష్యంగా బాషు మియా తై బజార్ టిక్కెట్లను అమ్ముతున్న ఫొటో కాపీని కూడా జత చేశారు. జిల్లా కలెక్టర్ క్షేత్ర దర్యాప్తు నిర్వహించి తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు దారు పఠాన్ సద్దాం ఖాన్ అభ్యర్థించాడు. బాషు మియాను తన పదవి నుంచి తొలగించి, అతని స్థానంలో మరొకరిని నియమించి, ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కూడా ఫిర్యాదుదారు విజ్ఞప్తి చేశాడు.

# బస్తీ దావఖాన ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్** : తెలంగాణ రాష్ట్రంలోని బస్తీ దావఖానల్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్స్, నర్సింగ్ ఆఫీసర్స్, సపోర్టింగ్ స్టాఫ్ – ఈ మూడు కేటగిరీల ఉద్యోగులకు గత నాలుగు నెలలుగా (మార్చి, ఏప్రిల్, మే, జూన్) వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఈ సందర్భంగా మాట్లాడుతూ, బస్తీ దావఖానల్లో కాంట్రాక్టు విధానంలో నియమితులైన సపోర్టింగ్ స్టాఫ్‌ను ఇటీవల ఏజెన్సీలకు అప్పగించడం జరిగిందని గుర్తుచేశారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, బస్తీ దావఖాన సపోర్టింగ్ స్టాఫ్ అందరినీ కాంట్రాక్టు విధానంలోకి తీసుకురావాలని (లేదా) ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆ కార్పొరేషన్ ద్వారా ప్రతి నెలా 1న బస్తీ దావఖానలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని రాజేష్ ఖన్నా కోరారు. ఈ డిమాండ్లు నెరవేరని పక్షంలో రానున్న రోజుల్లో ఉద్యోగులందరితో కలిసి ధర్నాకు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు

# మృతురాలి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, జమ్మికుంట** : జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల వజ్రమ్మ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందారు. సోమవారం, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మడిపల్లి గ్రామంలోని వజ్రమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, మృతురాలి భర్త అంబాల రాజయ్య, కుమారులు అంబాల కిరణ్ కుమార్, అంబాల నరేష్ కుమార్లను స్వప్న సదానందం పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ, అంబాల వజ్రమ్మ మృతి వారి కుటుంబానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో నగరం గ్రామ శాఖ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకు సంపత్, అంబాల రాజు, అంబాల చంద్రయ్య, శనిగరపు రవీందర్, రాం సురేష్, సిరిసిల్ల కిషన్, కొలుగూరి చిన్న, కల్వల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అభ్యాస స్కూల్‌లో అద్భుతమైన రోబోటిక్ ఈవెంట్ ఆవిష్కరణ

● రిటైర్డ్ డీఈఓ నన్నపు రాజు రామేశ్వర రాజు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్** : వరంగల్ నగరంలోని శంభునిపేట గణేష్ నగర్‌లో గల అభ్యాస స్కూల్లో వినూత్నమైన రోబోటిక్ విద్యా ఈవెంట్‌ను ఆవిష్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ మీర్జా అఖిల్ ఉల్లా బేగ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశ్రాంత జిల్లా విద్యా శాఖ అధికారి నన్నపరాజు రామేశ్వర రాజు ముఖ్య అతిథిగా హాజరై ఈవెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామేశ్వర రాజు మాట్లాడుతూ, రానున్న సమాజానికి సరైన సమయంలో, సరైన టెక్నాలజీ విద్యను అందించడానికి అభ్యాస స్కూల్ చేస్తున్న కృషిని అభినందించారు. కేవలం పుస్తకాల విద్యే కాకుండా నిత్య జీవితంలో అవసరమైన విద్యను ప్రతి విద్యార్థికి అందించాలని కోరారు. అటువంటి విద్యను అందిస్తున్న అభ్యాస స్కూల్‌ను ప్రశంసించారు. ఈ స్కూల్‌లో చదివిస్తున్న తల్లిదండ్రులు అదృష్టవంతులని, విద్యార్థులకు ఏది కావాలన్నా సమకూర్చే యంగ్ అండ్ డైనమిక్ డైరెక్టర్ ఉండటం విద్యార్థుల అదృష్టమని ఆయన అన్నారు. సమాజానికి ఏం అవసరమో పాఠశాల స్థాయి నుండే అలవర్చుకోవడం ఎంతో అవసరమని, అభ్యాసలో ఏర్పాటు చేసే ప్రతి కార్యక్రమం విద్యార్థి అభివృద్ధి కోసమే చేయడం అభినందనీయం అని పేర్కొన్నారు. కరస్పాండెంట్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ తమ సందేశంలో మాట్లాడుతూ, బెంగళూరు తరహాలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రథమంగా అభ్యాస స్కూల్‌లో ఈ రోబోటిక్ ఈవెంట్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ రోబోటిక్ విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించి, సంవత్సరంలో 50కి పైగా ఎగ్జిబిట్స్ తయారు చేయించడం అభ్యాస స్కూల్ లక్ష్యమని తెలిపారు. ట్రైన్ టీచర్ల ద్వారా ఒక పాఠ్యాంశంగా ఏర్పాటు చేసి, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను, సృజనాత్మకతను వెలికి తీసి వారిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళడమే అభ్యాస స్కూల్ లక్ష్యమని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రథమంగా ఏర్పాటు చేసిన ఏకైక స్కూల్ అభ్యాస స్కూల్ అని సగర్వంగా చెప్పుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఈవెంట్ ఆవిష్కరణలో పాల్గొన్న తల్లిదండ్రులు, తమ పిల్లలకు ఇంత త్వరగా ఇంత మంచి ఈవెంట్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ అవార్డు గ్రహీత కుమారి పి. లక్ష్మీ స్నిగ్ధ ప్రదర్శించిన స్వాగత నృత్యం అందరినీ ముగ్ధులను చేసింది. రోబోటిక్ టీమ్ సభ్యులు పాల్గొని రోబోటిక్ టెక్నాలజీ గురించి విద్యార్థులకు వివరించిన విధానం పలువురిని అబ్బురపరిచింది. ప్రిన్సిపాల్ మండల శిరీష, కోల రాము, ఉపాధ్యాయులు మహేష్, సంతోష్, రబ్బానీ, ప్రియాంక, రజినీ, భారతి, సృజన, సౌమ్య, సదానందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, జూన్ 23, 2025



# ఇందిరమ్మ ఇండ్లను త్వరగా నిర్మించుకోవాలి

**◆ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపూర్ గ్రామంతోపాటు నల్లబెల్లి మండల కేంద్రంలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ సమయంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం వేగంగా చేసుకుంటే ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయని అన్నారు. బేస్మెంట్ వరకు పనులు పూర్తయితే ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలో లక్ష రూపాయలు జమ చేస్తుందని తెలిపారు. నాలుగు విడతల్లో మొత్తం రూ. లక్షలు ప్రభుత్వ సహాయం అందుతుందన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే తెలియజేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక సమస్య రాకుండా కూపన్ ద్వారా ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బందులు రావద్దని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం నల్లబెల్లి మండల కేంద్రంలోని బీసీ వసతి గృహాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. హాస్టల్ లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను తెరిచి ఫిర్యాదులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా కలెక్టర్ మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అడిగి తెలుసుకున్నారు. ఈ జడ్పీ సీఈఓ రామి రెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, తహసీల్దార్, హౌసింగ్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రైతుల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

## వర్ధన్నపేట ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు రాయపర్తి మండలం, పోతిరెడ్డి పల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులు, పశువులకు వచ్చే దీర్ఘకాలిక రుగ్మతలను అరికట్టి పశువుల సంరక్షణే లక్ష్యంగా వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని అధికారులతో కలిసి వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పశువులకు మందులను అధికారులు రైతులకు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాడి రైతులను ఆదుకోవడానికి తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని, గ్రామీణ ప్రాంతంలోని యువత డైరీ పౌల్ట్రీ లపై దృష్టి సారించాలని తెలిపారు. పాడి రైతులు సొసైటీలోని రైతుల ద్వారా పశుసంపదను అభివృద్ధి చేసుకోవాలని గ్రామంలోని మహిళలు కంపోస్ట్ షెడ్డులను ఏర్పాటు చేసుకొని మండలంలో ఆదర్శ గ్రామంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ కాజమియా, తొర్రూరు బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్, రాయపర్తి మండల మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మొరిపిరాల ఎంపీటీసీ కోఆర్డినేటర్, మండల ముఖ్య నాయకులు నంగునూరు అశోక్ కుమార్, నాయకులు కొండం రామ్ నర్సింహారెడ్డి, మందపురి మహేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు ఎల్లయ్య, మందపురి అశోక్, రైతులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ నిధులు విడుదల చేయాలి

**◆ కలెక్టర్ ను కోరిన స్వేరోస్ ప్రతినిధులు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీంలో చదువుతున్న నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మూడు సంవత్సరాల పెండింగ్ నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతూ సోమవారం స్వేరోస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం స్వేరోస్ నాయకులు ఒంటేరు చక్రి, శనిగరపు రాజేంద్రప్రసాద్, మారేపల్లి మనోజ్, ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం నుంచి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ లో చదువుతున్న విద్యార్థుల నిధులు విడుదల కాక స్కూల్ యజమాన్యాలు చేతులెత్తేయడంతో విద్యార్థులందరూ ఎక్కడ చదువుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికత కలిగిన విద్యార్థులు కేవలం సీటు కోసం వలస వెళ్ళే పరిస్థితి నెలకొందన్నారు. కావున విద్యార్థుల స్థానికత ఆధారంగా ఉన్న స్థానిక ప్రైవేట్ విద్యా సంస్థలలో స్థానికంగా ఉన్న పిల్లలకు సీట్లు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత పెండింగ్ నిధులతో పాటు ఈ సంవత్సరం కూడా బెస్ట్ అవైలబుల్ స్కీంని కొనసాగిస్తూ పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ఆదుకోవాలన్నారు. ఈ మేరకు స్వేరోస్ నాయకులు కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక శాఖ మంత్రికి తెలియజేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లితండ్రులు కూడా పాల్గొన్నారు.



# బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్‌గా రాములు

**మేడ్చల్ సమావేశంలో ప్రకటన**

**వరంగల్ వాయిస్, కేసముద్రం :** కేసముద్రం మండలం తాళ్ళపూసపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రాచర్ల రాములును బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ గా నియమించారు. మేడ్చల్ జిల్లాలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ బీసీ రాజ్యాధికార సాధన కొరకు దాసు సురేష్ చేస్తున్న పోరాటానికి నా వంతుగా కృషి చేస్తానన్నారు. నా మీద నమ్మకంతో రాష్ట్ర స్థాయి పదవి అప్పజెప్పినందుకు దాసు సురేష్ కు, సహకరించిన జిల్లా అధ్యక్షులు వీరేందర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గండి వీరేందర్ గౌడ్, రాష్ట్ర యువ నాయకులు సాయి కిరణ్ పొడకంటి, శ్రీశైలం, గోపాల్, మహిళ నాయకులు శోభారాణి, భాగ్యలక్ష్మి, వివిధ జిల్లాల అధ్యక్ష్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బీరన్న బోనాలకి రండి

**మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి ఆహ్వానం**

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలో జులై 6న తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కరిమాబాదులో కురుమ కులస్తులు నిర్వహించనున్న బీరన్న బోనాల జాతరకు రావాలంటూ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావుని కమిటీ సభ్యులు కోరారు. కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మర్యాదపూర్వకంగా మాజీ ఎమ్మెల్సీని కలిసి బీరన్న బోనాలకు రావాల్సిందగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షులు కోరే కృష్ణ, ఉపాధ్యక్షులు కడారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి మురికి రాజు, సహాయ కార్యదర్శి దయ్యాల సుధాకర్, కోశాధికారి నరిగ లక్ష్మణ్, ముఖ్య సలహాదారులు కంకల మల్లేశం, మండల కొమురెల్లి, కోర కుమారస్వామి, బండారి రాజేశ్వర్, ఆర్గనైజర్స్ నంద నవీన్, కొట్టే సదానందం, గుట్ట మల్లేశం, కార్యవర్గ సభ్యులు కంచ తిరుపతి, వాసవి శ్రీనివాస్, ఎమ్మె వేణు, కోరే రమేష్, అన్న శ్రీనివాస్, మురికి చిన్న రవి, కంచ మెట్టయ్య, కొమ్ము రాజు, కాటన్ సతీష్, బండారి మల్లేశం, కుల పెద్దలు మండల రాజు, దయ్యాల పురుషోత్తం, కురుమ కులస్తులు పాల్గొన్నారు .

# నీరు కలుషితం కాకుండా చర్యలు

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- కేయూసీ, దేశాయిపేట ఫిల్టర్ బెడ్ లలో ఆకస్మిక తనిఖీ
- రీసైక్లింగ్ హబ్ పనితీరు పరిశీలన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తాగు నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పరిధిలోని కాకతీయ యూనివర్సిటీ (కేయూసీ) ఫిల్టర్ బెడ్ తో పాటు దేశాయిపేట ప్రాంతంలోని ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ ను కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి నీటి సరఫరా తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమర్థవంతంగా నీటి సరఫరా జరిగేందుకు తగు సూచనలు చేశారు. ఫిల్టర్ బెడ్ లో నీటి లభ్యత, నీటి నాణ్యత నిర్ధారణ పరీక్షల తీరు తదితర అంశాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోర్ సిటీతో పాటు విలీన గ్రామాలకు నీటి సరఫరా అయ్యే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పలు సూచనలు చేశారు. నీటి సరఫరాలో ఏమైనా లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నీరు కలుషితం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కేయూసీ ఫిల్టర్ బెడ్ సందర్శనలో భాగంగా ఇదే ఆవరణలో ఉన్న రీసైక్లింగ్ హబ్ (సెంట్రల్ హబ్) ను కమిషనర్ సందర్శించారు. అదనంగా మరో రెండు యంత్రాలను ఏర్పాటు చేసుకొని ఎప్పటికప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలను ప్యాకింగ్ చేసి కంపెనీలకు ఎగుమతి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈలు శ్రీనివాస్, రవికుమార్, డీఈలు రాజ్ కుమార్, కార్తీక్ రెడ్డి, ఏఈలు హరికుమార్, సరిత, శానిటరీ సూపర్ వైజర్ నరేందర్, శానిటరీ ఇన్ స్పెక్టర్లు భాషా నాయక్, అనిల్ వావ్ ప్రతినిధి పవన్ తదితరులు పాల్గొన్నారు.

### బల్దియా ప్రజావాణికి 133 అర్జీలు..

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు శ్రద్ధ వహించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ హితవు పలికారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విభాగంలో 41, హెల్త్, సానిటేషన్ లో 12, ప్రాపర్టీ టాక్స్ (రెవెన్యూ) లో తొమ్మిది, టౌన్ ప్లానింగ్ విభాగంలో 68, తాగు నీటి సరఫరా విభాగంలో మూడు మొత్తం 133 అర్జీలు వచ్చినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఇంచార్జి ఎస్ఈ మహేందర్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్ఓలు రమేష్, లక్ష్మారెడ్డి డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, టీఓ రామకృష్ణ, ఈఈలు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సేవాదళ్ ను విస్తృతం చేస్తాం..

- ఎమ్మెల్యే నాగరాజు
- మర్యాదపూర్వకంగా కలిసిన సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బొచ్చు చందర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ను సోమవారం హనుమకొండలోని ఆయన స్వగృహంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బొచ్చు చందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ సేవాదళ్ ను విస్తృతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని బొచ్చు చందర్ కు సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిన్నాల గోనాథ్, హనుమకొండ నియోజవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు తాళ్లపల్లి రాజు, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా జనరల్ సెక్రెటరీ తాటికొండ ప్రసాద్, పరకాల ఎస్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాస్, కాంగ్రెస్ సేవాదళ్ ఇన్ స్పెక్టర్ పి.యాదగిరి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిష్టయ్య, కొక్కిరాల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఒలంపిక్ డే రన్

- పోచమ్మ మైదాన్ టు ఓ సిటీ స్టేడియం
- ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ సీఈఓ శ్రీ రామ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** 'అంతర్జాతీయ ఒలంపిక్ డే సెలబ్రేషన్స్' లో భాగంగా సోమవారం పోచమ్మ మైదాన్ చౌరస్తా నుంచి ఓ సిటీ స్టేడియం వరకు ఒలంపిక్ డే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ సీఈఓ శ్రీ రామ్ రెడ్డి హాజరయ్యారు. క్రీడా రంగం ద్వారా కేవలం ఆరోగ్యమే కాకుండా దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించడానికి అవసరమైన క్రీడా నైపుణ్యాలను తీర్చిదిద్దుకోవడానికి అవకాశాలను ఇవ్వడంతో పాటుగా జీవితం గమనంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి కావలసినటువంటి నైపుణ్యాలను కూడా నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. 140 కోట్ల జనాభాలో మనం ఎన్ని పతకాలను సాధించాము అనే ప్రశ్న కంటే మన వంతుగా మన ఇంట్లో ఉన్న పిల్లలను ఎంతమందిని క్రీడారంగానికి పరిచయం చేస్తున్నామనే ప్రశ్నను ఎవరికి వారు వేసుకోవాలన్నారు. క్రీడారంగంలో ఉన్నటువంటి ఉపయోగాలను అర్థం చేసుకొని తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రీడలు ఆడే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ బి.కైలాష్ యాదవ్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ బొమ్మినేని రవీందర్ రెడ్డి, రైసింగ్ సన్ విద్యా సంస్థ చైర్మన్ షణ్ముఖ చారి, డీవైఎస్ఓ కోచ్ లు, సిబ్బంది, వివిధ క్రీడా సంఘాల బాధ్యులైన అధ్యక్ష కార్యదర్శులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, వివిధ పాఠశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ స్టూడెంట్స్ పాల్గొన్నారు. క్రీడాకారులకు బొమ్మినేని రవీందర్ రెడ్డి చేతుల మీదుగా మెడల్స్ ప్రధానం చేశారు.



# పత్రిక ఆగినా.. మిత్రుల కలయిక ఆగదు

- మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్
- ఉదయం పూర్వపాత్రికేయ మిత్రమండలి తృతీయ సమావేశం

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ఉదయం దినపత్రిక మూతబడి 30 సంవత్సరాలు గడిచినా అందులో పనిచేసిన వరంగల్ జిల్లా పాత్రికేయులు, ఇతర సిబ్బంది ఉదయం మిత్రమండలి పేరుతో ఇప్పటికీ కలుస్తుండడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని ఉదయం దినపత్రిక మాజీ న్యూస్ కోఆర్డినేటర్, మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్ అన్నారు. ఉదయం దినపత్రిక మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ తృతీయ సర్వసభ్య సమావేశం ఆదివారం మహబూబాబాద్ లోని లయన్స్ క్లబ్ భవనంలో ఉదయం మిత్ర మండలి అధ్యక్షులు దాసరి కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్ మాట్లాడుతూ.. పత్రిక మూతబడినా ఆనాటి పాత్రికేయులు, సిబ్బంది తమ మధ్య ఉన్న ఆత్మీయ బంధాన్ని మరింత దృఢ పరుచుకోవడానికి ఆనాటి స్టాఫ్ రిపోర్టర్ దాసరి కృష్ణారెడ్డి చేసిన కృషి అభినందనీయమన్నారు. ఆనాటి పత్రికేయులు, సిబ్బంది సంక్షేమం కోసం ఆర్థిక సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం కూడా ప్రశంసనీయమన్నారు. తాను ఉదయం దినపత్రికలో పనిచేసినప్పుడు స్టాఫ్ రిపోర్టర్లు, సిబ్బంది, స్ట్రింగర్లతో ఆత్మీయంగా వ్యవరించేవాడినన్నారు. ఆనాడు ఉదయం దినపత్రిక ప్రజల పక్షం వహిస్తూ ప్రజల మన్ననలు చూరగొన్నదని గుర్తు చేశారు. అనేక సమస్యలను వార్తల ద్వారా పరిష్కరించిన ఘనత ఉదయంకు దక్కిందన్నారు. ఆనాడు ఉదయంలో పనిచేసిన పాత్రికేయులు అందరూ జీవితంలో స్థిరపడినా తాము పనిచేస్తున్న పత్రికను గుర్తుపెట్టుకొని అసోసియేషన్ గా ఏర్పడి తరచుగా కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయం మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్నా పరశురాములు, కోశాధికారి అచ్యుత రఘునాథ్, ఉపాధ్యక్షులు మహేందర్, సంయుక్త కార్యదర్శి ముల్లంగి మోహన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు శర్మ, రామ్మూర్తి, ఉదయం జ్ఞాపిక సంపాదకులు ఆర్.లక్ష్మణ్ సుధాకర్, పూర్వ పాత్రికేయులు సత్యనారాయణ, రమేష్, గొడుగు శ్రీనివాస్, రామారావు, శ్రీధర్, ఓంకార్ సింగ్ పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com